
వేములవాడలో ఓటు వేసేందుకు మహిళల క్యూ


ముస్తాబాద్‌లో బారులు తీరిన ఓటర్లు


గంభీరావుపేటలో..


తంగళ్లపల్లిలో మాక్ పోలింగ్

ఓటెత్తిన చైతన్యం

- ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు
- మొరాయించిన ఈవీఎంలు
- పలు పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు బేఖాతర్
- రాత్రి 8 గంటల వరకు కొనసాగిన పోలింగ్

సిరిసిల్లటౌన్: ప్రజాచైతన్యం ఓటెత్తింది. గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి కేటీఆర్ ఇలాకా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అన్ని పోలింగ్ బూతుల్లో అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్‌లో స్థానిక జెడ్పీజీహెచ్‌ఎస్ స్కూలులో ఈవీఎం మొరాయించగా అధికారులు సరిచేశారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన నవతరం నుంచి తొంభై ఏళ్ల వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 80ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటివద్దే ఓటింగ్ అవకాశం ఇవ్వగా అక్కడ వినియోగించుకోని వారు సహాయకులతో వచ్చి పోలింగ్‌స్టేషన్‌లో ఓట్లు వేశారు. కొన్ని పోలింగ్ బూత్‌ల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ పూర్తయింది. మంత్రి కేటీఆర్, కేకే మహేందర్‌రెడ్డి, రాణిరుద్రమరెడ్డి, లగిశెట్టి శ్రీనివాస్, పత్తిపాక సురేశ్ జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించారు.

పార్టీ నేతల అత్యుత్సాహం..

పలు పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీల నేతలు నిబంధనలు బేఖాతర్ చేస్తూ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం చేయడం కనిపించింది. స్థానిక వికాస్ డిగ్రీ కళాశాల పోలింగ్‌స్టేషన్ వద్ద ఇరు పార్టీల నేతల మధ్య వివాదం నెలకొంది. స్థానిక సుందరయ్య నగర్ పోలింగ్‌స్టేషన్‌లోకి మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుమార్లు వస్తూ పోతుండటంపై విమర్శలు వచ్చాయి. గో బ్యాక్ అంటూ.. ఓటింగ్ లైన్లో నిల్చున్న స్థానికులు నినాదాలు చేశారు. స్థానిక శివ నగర్ తదితర పోలింగ్ స్టేషన్లలో మంత్రి కేటీఆర్ పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఆలస్యంగా ముగిసిన పోలింగ్

వేములవాడ: వేములవాడ పట్టణంలో మందకొడిగా పోలింగ్ సాగింది. ఓల్డ్అర్బన్‌కాలనీలోని పోలింగ్ కేంద్రాల్లో చీకటి కమ్ముకోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. దీంతో గంటన్నర ఆలస్యంగా పోలింగ్ ముగిసింది. ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య బందోబస్తును పరిశీలించారు.


సిరిసిల్లటౌన్: పోలింగ్ సమయం తర్వాత సుభాష్‌నగర్‌లో బారులు తీరిన ఓటర్లు

మొరాయించిన ఈవీఎంలు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీపూర్ ఎన్నికల కేంద్రంలో ఓటింగ్ జరుగుతుండగా ఈవీఎం మొరాయించింది. ఓటింగ్ సమయం ఉదయం 7 గంటలు కాగా గోపాల్‌రావుపల్లెలో ఓటు వేసేందుకు ఒక అవ్వ ఉదయం 6:30కే చేరుకుని అరగంట పాటు వేచి చూసి ఓటువేసి వెళ్లింది.

ముస్తాబాద్: మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ ఆలస్యం కావడంతో పోలింగ్ కొంత ఆలస్యంగా మొదలైంది. సమస్యాత్మక గ్రామాలైన నామాపూర్, ముస్తాబాద్, పోతుగల్, మద్దికుంట గ్రామాల్లో సాయుధ పోలీసు బలగాల బందోబస్తు మధ్య పోలింగ్ నిర్వహించారు.

గంభీరావుపేట: మండలంలోని దేశాయిపేటలో ఈవీఎంలు సాంకేతిక సమస్య వల్ల మొరాయించడంతో పావుగంట ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలోని గజసింగవరంలో టిస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, గంభీరావుపేటలో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామంలోని 147 బూత్‌లో ఈవీఎం 20 నిమిషాలు మొరాయించడంతో వెంటనే సిబ్బంది స్పందించి మరమ్మతు చేశారు. తదుపరి ఓటింగ్ యదావిధిగా కొనసాగింది. కొన్ని గ్రామాల్లో వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీల్ చైర్‌లు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించిన పోలీస్ శాఖ విధులతో పాటు ఓటర్లకు సేవలందించారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 95 వ నెంబర్ పోలింగ్ బూతులోని ఈవీఎం మొరాయించింది. రెండు, మూడు దఫలుగా సుమారు 45 నిమిషాలు సమయం సేపు పోలింగ్ ఆగిపోయింది. పోలింగ్ నిలిచిపోవడంతో ఓటర్లు అసహనానికి గురయ్యారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధిలో రుద్రవరం గ్రామంలోని పోలింగ్ కేంద్రం 211లో ఈవీఎం 20 నిమిషాల పాటు మొరాయించింది.

ఎల్లారెడ్డిపేట: మండలంలో చాలా గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటువేయడంలో ఆలస్యం జరిగింది. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్‌ల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రుద్రంగి: మండలంలో ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయి. ఎస్సై రాజేశ్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహించారు. వికలాంగ, వృద్ధ ఓటర్లను గ్రామ యువకులు, ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బంది వీల్ చైర్‌లలో తీసుకువెళ్లి ఓటు వేయించారు.

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల, వన్పల్లి, బావుసింగ్ తండా గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గర్జనపల్లి పీఎస్‌లో వెలుతురు సరిగా లేక వృద్ధులకు గుర్తులు సరిగా కనబడకపోవడంతో ఓటు వేయడానికి ఇబ్బంది పడ్డారు.

బోయినపల్లి: మండలంలో అసెంబ్లీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఎస్పీ అఖిల్ మహాజన్ మండలంలో పోలింగ్ తీరును పరిశీలించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లో..


సిరిసిల్లటౌన్: ఓటు వేసి మురిసిపోతున్న 98 ఏళ్ల అన్నపూర్ణమ్మ


ముస్తాబాద్‌లో బారులుతీరిన ఓటర్లు


వేములవాడఅర్బన్: నాంపల్లిలో..


ఎల్లారెడ్డిపేటలో..


రుద్రంగిలో క్యూలో ఉన్న ఓటర్లు


ముస్తాబాద్‌లో బీఎస్‌ఎఫ్ జవాను సేవలు



సిరిసిల్లలో పోలీసు సిబ్బంది, రుద్రంగిలో ఎస్సై రాజేశ్ పోలింగ్ కేంద్రాల వద్ద సేవలు


వీర్నపల్లిలో ఓటు వేసిన యువతులు

'యువ'తరం.. ఓటేసింది

- మొదటి ఓటుతో యువత
- చిగురించిన కొత్త ఆశలు
- కొత్త కొత్తగా ఉన్నది

సిరిసిల్ల/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/వేములవాడఅర్బన్/కోనరావుపేట: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మనది. ఆ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం ఓటు హక్కు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన శాసన సభ ఎన్నికల్లో యువతరం ఓటేసింది. కొత్తగా ఓటరు గుర్తింపు కార్డును పొందిన యువతీ, యువకులు తొలిసారి పోలింగ్ కేంద్రానికి అమూల్యమైన హక్కును ఉపయోగించుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నచ్చిన నాయకుడిని ఎన్నుకునే ప్రక్రియలో భాగస్వాములయ్యారు. పాలకులపై ఎన్నో ఆశలు.. మరెన్నో ఊసులతో మొదటిసారి చూపుడు వేలిపై సిరా చుక్క వేయించుకుని ఏ కల్మషం లేకుండా ఆత్మసాక్షిగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలిసారి ఓటు వేసి యువ'తరం' అంతరంగమిది...

కొత్తగా అనిపించింది..



నేను ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న. నాకు మొదటిసారి ఓటరు గుర్తింపు కార్డు వచ్చింది. మా అమ్మానాన్నలు పబ్బతి ఉమా, జితేందర్‌రెడ్డిలతో హైదరాబాద్ నుంచి కలిసి వచ్చి జిల్లెల్లలో ఓటు వేశాను. రాజకీయాల గురించి మా ఇంట్లో చర్చించుకోవడం విన్నాను. కానీ మొదటిసారి ఓటు వేస్తుంటే.. కొత్తగా అనిపించింది.

– పబ్బతి మనస్వితారెడ్డి, జిల్లెల్ల

థ్రిల్‌గా ఉంది..



నేను మొదటి సారి ఓటు వేయడం థ్రిల్‌గా ఉంది. ఓటరు గుర్తింపు కార్డు రావడంతో ఈ ఎన్నికల్లో మొదటిసారి ఓటు వేశాను. పోలింగ్ కేంద్రాన్ని చూడడమే ఇది మొదటిసారి. మా అమ్మానాన్నలు లలిత, శ్రీనివాస్‌లు రాజకీయాల్లో ఉన్నా.. నాకు పెద్దగా ఆ రాజకీయాలు తెలియదు. నేను ఇంజినీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న.

– అక్కరాజు గ్రీష్మానిత్య, సిరిసిల్ల

మంచి అనుభూతి కలిగింది..



నేను హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న. ఎన్నికల నేపథ్యంలో కాలేజీకి సెలవు ఇచ్చారు. నాకు ఓటరు గుర్తింపు కార్డు ఇటీవలే వచ్చింది. మొదటిసారి ఓటు వేయాలని హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు వచ్చాను. భయం.. భయంగానే పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాను. ఓటు వేయడంతో మంచి అనుభూతి కలిగింది.

– పూరడి దినేశ్, సిరిసిల్ల

అక్కా చెల్లెళ్ల ఆనందం



కరీంనగర్‌లో ఉండే మేము ఓటు వేసేందుకు మా అమ్మా నాన్నలతో కలిసి ఇల్లంతకుంట మండలం వల్లంపట్లకు వచ్చాం. ఇద్దరం మొదటి సారి ఓటు వేశాం. చాలా సంతోషం అనిపించింది. అసలు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడమే మొదటి సారి కావడంతో కొత్తగా అనిపించింది. చూపుడు వేలిపై సిరా చుక్క పెట్టారు. ఆత్మసాక్షిగా ఓటు వేసి ఆనందపడ్డాం.

– మొగులోజు శృతిక, సాత్విక, వల్లంపట్ల

యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి



యువతీ యువకులు ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును సద్వినియోగపర్చుకోవాలి. నేను ఈ రోజు తొలిసారిగా ఓటేశాను. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది. అటువంటి ఓటు హక్కుతో సమర్థవంతమైన పాలన అందించే నాయకున్ని ఎన్నుకోవాలి. వారితోనే గ్రామాల ప్రగతి సాధ్యమవుతుంది.

–బాశెట్టి లిఖిత, నిమ్మపల్లి

చాలా సంతోషంగా ఉంది



మాది రుద్రవరం గ్రామం నేను తోలిసారి ఓటు హక్కును వినియోగించుకున్నాను. ఓటు వేయడం మొదటి సారి కావడంతో చాల సంతోషంగా అనిపించింది. నేను నా బాధ్యతగా ఓటును వినియోగించుకున్నాను.

– అంజలి, రుద్రవరం

ఓటు వేయడం సంతోషంగా ఉంది



నేను బీటెక్ చేస్తున్నాను. తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకున్నాను. ఈ అనుభూతి కొత్తగా ఉంది. మన ప్రజాప్రతినిధులను మనమే ఎన్నుకోవడం గొప్ప విషయం. అందరూ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలి.

– విద్య, గూడెం

సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు



కొత్తగా ఓటు హక్కు పొందిన వారు సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు అవుతున్నారు. ఓటు వేయడం అంటే మన భవిష్యత్‌ను మనమే నిర్మించుకోవడం అన్నమాట. మంచి నాయకుడిని చట్టసభలకు పంపిస్తేనే పాలన సజావుగా సాగుతుంది.

– అన్నం శ్రీయ, ముస్తాబాద్

రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం



రాజ్యాంగం ప్రతి పౌరునికి 18 ఏళ్లకే కల్పించిన గొప్ప వజ్రాయుధం ఓటు. దీనిని యువత తప్పనిసరిగా వినియోగించుకోవాలి. దేశ అభివృద్ధిని కాంక్షించే వారికే ఓటు వేయాలి. అప్పుడే ఉత్తమ పాలన ప్రజల దరి చేరుతుంది. మొదటిసారి ఓటు వేయడం ఆనందంగా ఉంది.

– మెరుగు శ్రీరాం, శ్రీనిధి, అన్నాచెల్లెళ్లు, నామాపూర్

ఒకే కుటుంబం నుంచి అక్కాచెల్లెళ్లు



ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కచెల్లెళ్లు తొలిసారి మొదటి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఇద్దరు కలిసి మొదటిసారి ఓటు వేయడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మొదటి సారి పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి కొంత భయం వేసిన ఓటు వేసిన అనుభూతి ఉందన్నారు.

–మోతే అభినయ, అఖిల, నారాయణపూర్

జీవితంలో మరిచిపోనిది



ఈ సంవత్సరంలోనే కొత్తగా ఓటు హక్కు వచ్చింది. ఇదే ఏడాదిలో ఎన్నికలు రావడం మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోవడం జీవితంలో మరిచిపోలేనిది. నాన్నగారితో కలిసి వెళ్లి మొదటి ఓటు వేయడం సంతోషంగా ఉంది. ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తాయి. ఓటు అనే ఆయుధంతో మన తలరాతలు మార్చుకోవచ్చు.

– బుగ్గ శ్రీనిధి, రాచర్లగొల్లపల్లి

జీవితకాలం గుర్తుంటుంది



మొదటి ఓటు వేసిన రోజు జీవితకాలం గుర్తుంటుంది. హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నా. ఓటు వేయడానికి ఒక్కరోజు ముందే ఎల్లారెడ్డిపేటకు వచ్చి ఓటు వేశా. తొలిఓటు వేసేందుకు చాలామంది తమ తోటి విద్యార్థులు వారి గ్రామాలకు వెళ్లారు.

– ఒగ్గు వికాస్‌యాదవ్, ఎల్లారెడ్డిపేట

ఓటు అనేది భవిష్యత్తును తీర్చిదిద్దేది



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అనేది మనకు రాజ్యాంగం కల్పించిన ఆయుధం లాంటిది. ఈ ఓటు మన భవిష్యత్తును తీరిదిద్దుతుంది. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే విదంగా కృషి చేసేవారిని ఎన్నుకుంటే దేశానికి పట్టుగొమ్మలైన గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. తొలిసారి ఓటేయడం సంతోషంగా ఉంది.

– స్వాతి, భార్గవి

తొలిసారి ఓటు వేశా



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యత. ఈ అసెంబ్లీ ఎన్నికలకు తోలిసారి ఓటు హక్కును వినియోగించుకున్నాను. చాల సంతోషంగా ఉంది.

– జంగం రేవతి, నాంపల్లి

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన అభ్యర్థులు




వేములవాడ: వేములవాడలోని పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లతో వారు మాట్లాడారు.

పోలింగ్ కేంద్రాల్లో సహాయక బృందాలు

ఎల్లారెడ్డిపేట: ప్రస్తుతం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు ఏర్పాటు చేసిన సహయక బృందాలు ఓటర్లకు ఎంతగానో ఉపయోగపడ్డారు.ఎల్లారెడ్డిపేట మండంలోని వివిధ గ్రామాల్లోని కేంద్రాల దగ్గర ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్దకు ఓటర్లు రాగానే వారికి పోలింగ్ బూత్,అక్కడి వరకు వెళ్లడానికి అన్ని చర్యలు తీసుకున్నారు.ముఖ్యంగా ఆరోగ్య సిబ్బంది,అంగన్‌వాడీ కార్యకర్తలు,వాలంటీర్లు నిరక్షరాస్యులైన ఓటర్లు వచ్చినప్పుడు వారికి దగ్గర ఉండి వారు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేవిధంగా సహయపడ్డారు.అంతే కాకుండా అంగవైకల్యులు,వికలాంగులు ఓటు వేయడానికి వచ్చిన సంధార్భాల్లో వారికి దగ్గరుండి పోలింగ్ బూత్‌దగ్గరకు తీసుకెళ్లి వారు ఓటు వేసిన ఆనంతరం తిరిగి వారు వచ్చిన వాహనాల వద్దకు చేర్చారు.ప్రధానంగా అన్ని గ్రామాల్లో ఎక్కువగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఎక్కువగా ఈ విషయంలో శ్రమించారు.మొత్తంగా కేంద్రాల దగ్గర ఏర్పాటు చేసిన ఈ బృందాలతో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఎల్లారెడ్డిపేటలో కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సహాయక కేంద్రం

చిన్నపాటి సంఘటనలే..

- సుందరయ్యనగర్‌లో బీఆర్‌ఎస్ లీడర్‌పై ఓటర్ల ఫైర్
- సెల్‌ఫోన్‌తో వచ్చిన యువకుడికి కౌన్సెలింగ్

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చిన్నపాటి వివాదాలు చోటుచేసుకున్నాయి. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, ట్రాఫిక్ ఎస్సై రాజుకుమార్ సర్దుబాటు చేశారు. సుందరయ్యనగర్‌లోని 168 పోలింగ్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ నాయకుడు సిరిసిల్ల మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుమార్లు రావడంతో అక్కడే ఉన్న ఇతర పార్టీల నాయకులు దానిని వ్యతిరేకించారు. తాను పోలింగ్ బూత్ ఏజెంట్‌ను అని తెలిపినా ఎన్నిసార్లు వస్తారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడే ఉన్న ట్రాఫిక్ ఎస్సై రాజ్‌కుమార్ ఉన్నతాధికారుల ఆదేశాలతో అతన్ని పలు పార్టీల నాయకులు బయటకు పంపారు. వెంకంపేట ఏరియాల్లో ఓ పోలింగ్ కేంద్రానికి సెల్‌ఫోన్‌తో వచ్చిన యువకుడితో పోలీసులకు వాగ్వాదం జరిగింది. కోడ్ అమలులో భాగంగా సెల్‌ఫోన్ పోలింగ్ కేంద్రానికి నిషేధమని తెలపడంతో అది తనకి తెలువదని, తొలిసారి ఓటుహక్కు వచ్చిందని యువకుడు పోలీసులకు తెలపడంతో అక్కడే ఉన్న సీఐ ఉపేందర్ వివాదాన్ని పరిష్కరించారు.


బీఆర్‌ఎస్ నాయకుడు మంచె శ్రీనివాస్‌ను అడ్డుకున్న పోలీసులు